


లేఖకుడు

పరశురాం

అనువాదకుడు

చక్రపాణి

# చికిత్సాసంకటం

ప్రొద్దు క్రుంకుతూవుంది. హాగ్ బజారునుండి నందదులాల్ బాబు ట్రాము మీద యింటికి వస్తున్నాడు. బీడన్‌స్ట్రీట్ దాటిన తర్వాత ట్రాము నెమ్మదిగా పోసాగింది. ఎదుట ఎద్దుబండివుంది. ఇంకా కొంచెం ముందుకు పోతే నందదులాల్ బాబు ఇంటికి వెళ్లే సందు వచ్చేస్తుంది. ఇంతలో ప్రక్క గల్లీ లోంచి స్నేహితుడు బంకూ రావడం చూచాడు. నందదులాలు ఉప్పొంగుతూ కేకవేయసాగాడు—"అరె బంకూ, ఆగవోయి నేనూ వస్తున్నా."

నందదులాలుబాబు రెండుచంకలలో రెండు మూటలు యిరికించుకొని తత్తర బిత్తరగా దిగబోవడంలో కాలికి ధోవతి అడ్డంపడి క్రింద పడిపోయాడు.

ట్రాంలో ఒక్కసారి గోలపుట్టింది. 'టక్' అని ట్రాం ఆగింది. చాలామంది ప్రయాణీకులు దిగి నందబాబును లేవదీశారు. ట్రాంలోవున్నవాళ్ళు తల బైటకుపెట్టి సానుభూతి చూపించారు—"అరేరే, చాల దెబ్బతగిలింది—కొంచెం వెచ్చవెచ్చని పాలు త్రాగించండి—రెండు కాళ్లు తెగినయా యేంఖర్మం?—" ఒకడు మూర్ఛన్నాడు. రెండోవాడు తిప్పవచ్చిందన్నాడు. మరొకడు త్రాగుబోతన్నాడు. ఇంకొకడు పల్లెటూరి గబ్బిలా యన్నాడు. ఒక ముసలావిడ చెప్పసాగింది—"గాలి సోకిందేమోనమ్మా పాడు—గాలి!"

నిజానికి నందదులాలుకు ఎక్కడా దెబ్బ తగులలేదు. కాని అక్కడ ఎవడు వింటాడు!—భలే! తగలక పోవడమేమిటి? బాగా తగిలింది—లోపలి దెబ్బ—రెండు మాసాలు మంచం నెయ్యాల్సొస్తుంది. ఇంటికి పోయాక గాని తెలియదు."

తనకేమీ దెబ్బ తగల్లేదని నందబాబు దండాలు దస్కాలుపెట్టి చెప్పుకున్నాడు-ఒక ముసలాయనన్నాడు "చూచారా, మంచాడికి రోజులు కావివి. కళ్లార చూశాం తగలడం అయినా లేదని చెపుతున్నాడు!"

ఇంతలో బంకూకూడా వచ్చాడు. నందబాబు తప్పించుకుని బయట పడ్డాడు. విచారపడుతూన్న ప్రయాణికుల్ని తీసుకుని ట్రాముకూడా సాగిపోయింది.

బంకూ అన్నాడు-"అరే, నాక్కూడ కళ్ళు తిరిగినై. సరే యింటికివరకు నడవవద్దులే- ఏయ్‌రిక్షా!"-

రిక్షా నందబాబును నెమ్మది నెమ్మదిగా ఇంటి వైపుకు తీసుకవెళ్ళింది. బంకూ వెనువెంట నడచిపోయాడు.

నందదులాల్ బాబు నలభై వత్సరాల ప్రాయం వాడు. గుండ్రని మొహం. నల్లని రంగు. ఈయన తండ్రి యు. పి. కంసరియట్‌లో నౌకరిచేసి చాలా డబ్బు సంపాదించాడు. యముని దగ్గరనుంచి సమను వచ్చేటప్పటికి తన యేకపుత్రుడైన నందదులాలుకు కలకత్తాలో పెద్ద ఇల్లు, బళ్లకొలది సామాను, పెద్ద ప్రామిసరీనోట్లకట్ట వదలిపెట్టిపోయాడు. నందబాబుకు చిన్నతనంలోనే పెళ్లయింది. కాని ఆసంవత్సరమే కళత్ర వియోగం కూడ తటస్థించింది. తిరిగి ఇంతవరకు ఈయన మళ్లీ పెళ్ళిచేసుకోలేదు. ఇంట్లో ఒక ముసలావిడ మాత్రం ఉంది- ఈయనగారి మేనత్త. ఆమె యెల్లప్పుడు పూజాపునస్కారాల్లో మునిగివుంటుంది. పనిపాటలు నౌకర్లు చూస్తూంటారు. నందబాబుకు రెండో పెండ్లి అంటే అయిష్ట తేమీలేదు. కాని ఇంతవరకది సిద్ధించలేదు. దీనికి ముఖ్యకారణం సోమరితనం. థియేటర్, సినిమా, ఫుట్ బాల్ మేచ్, రేస్, స్నేహితులతో తిరగటం- వీటితోనే ఈయన హాయిగ కాలం వెళ్లబుస్తున్నాడు. ఇక పెండ్లికి తీరికెక్కడ? ఇంతేకాక కాలంకూడ గడచిపోతూవుంది. ఇక మానేయడమే మంచిది. ఇంతకు తేలినమాట-నందబాబు అమాయకుడు, మితభాషి, సోమరి, కూర్చొన్నచోట చదలు పట్టవలసిందే.

సాయంత్రం నందబాబు మేడక్రిందిభాగంలో మిత్రు లందరు కూడారు. లేత లేత సొరకాయలు తెగిపోతున్నై. నందబాబుకు ఇవ్వాళ కులాసాగాలేదు. శాలువ కప్పుకొని పండుకున్నాడు. మిత్రులు కాఫీ రొట్టె ఖాళీచేశారు. ఇక తాంబూలం- సిగరెట్లవంతు వచ్చింది-గప్పాలు సాగుతూనే వున్నవి.

గోపీబాబు చెపుతున్నాడు--ఉహూఁ! శరీరాన్నింత నిర్లక్ష్యంగా చూడగూడదు నందబాబూ! ఇటువంటి చలిరోజుల్లో కళ్ళు తిరగడం మంచి లక్షణాలుగా కనుపించడంలా.

నందబాబు--కళ్ళు తిరగలా, కాళ్లకు గుడ్డ అడ్డం పడి.........

గోపీబాబు:-అలాకాదోయి, తప్పక తిరిగుంటయి కళ్ళు, శరీరంకూడ అలసినట్టుగా ఉంది. దగ్గరే వున్నాడుగా డాక్టరు తఫాదార్. ఇంత గొప్ప ఫిజిషియన్ ఈ పట్నంలో దొరకడు. పోరాదూ రేపు ఉదయం, కొంచెం కనపడివస్తే యేం చెపుతాడో.

బంకూ—ఒకసారి నేపాల్ బాబుకు చూపించమని నాసలహా. ఇంత అనుభవంగల హోమియో పథిక్ దొరకడం కష్టం. స్వభావంకొంచెం చిటపటలాడేది. అయితేయేం, ముసలాడు ఒకటోనెంబరు విద్వాంసుడు.

షష్టీబాబు శరీరమంతటా శాలువాతో దిట్టంగా కప్పుకుని వకమూల కూర్చొని వున్నాడు. తలకు మంకీ కేప్. బుగ్గపుస్తీలు వాటిపైన మఫ్లరు. అన్నాడు—అమ్మయ్యో! ఇటువంటి చల్లో వేళకానివేళప్పుడు ట్రాము ఎక్కుతారూ ఎవరన్నా? శరీరం చలిగొన్నప్పుడు పడరూమరి! నందబాబు శరీరాన్ని ఎప్పుడూ వెచ్చగా వుంచాలి.

నిధిరాం—నందూ భాయీ! ఈ మోటుజీవితం మానేసెయి. మాంధాత కాలంనాటి మంచం: దిలీపుని నాటి దిళ్లు, పరుపు, బగ్గీచూద్దామా ఎక్కితే సహించనంటుంది-ఇక గుర్రం రెక్కలులేని దేవతాశ్వం! అలా ఇటువంటి వాటితో ఎక్కడన్నా శరీరం సుఖపడుతుందీ నీకేం డబ్బు మూలుగుతోంది. కొంచెం ఖర్చుచేసి షోకుగా తిరగటంకూడా నేర్చుకో.

ఆఖరుకు నందబాబు రేపు డాక్టరు తఫాదార్ ఇంటికి వెళ్ళడం నిశ్చయమైంది.

* * *

డాక్టర్ తఫాదార్ M. D., M. R. A. S. గ్రే స్ట్రీటులో వుంటున్నాడు. పెద్దమేడ. రెండు మోటారుకార్లు; ఒక లేండో‌గాడీ. ప్రసిద్ధిచెందిన డాక్టరు. బోలెడు ప్రాక్టీసు. రోగులు ఇంటికి పిలిపించుకుందామనుకొంటే పోవటానికి తీరుబడి ఉండదు. ఘంటన్నర ప్రక్కగదిలో కూర్చున్నాక నందబాబుకు పిలుపు వచ్చింది. డాక్టరుగారి గదిలో అప్పుడుకూడ ఒక రోగికిపరీక్ష జరుగుతూవుంది. లావాంటి మారువాడీ ఒకడు చొక్కా విప్పుకుని నిలబడి వున్నాడు. డాక్టరు టేపుతో బొర్ర కొలిచి అన్నాడు—'ఇంకేం, అంగుళంబాతిక పెరిగింది.' రోగి సంతోషంతో అడిగాడు- 'నాడిచూడండి' డాక్టరు నాడికిదగ్గరగా మోటారుకారుస్పార్కింగు ప్లగ్ పెట్టి అన్నాడు-'భలే బాగావుంది నడక.' రోగి అడిగాడు-'నాలుక చూడండి.' రోగి నాలుక తెరిచాడు. డాక్టరు దూరంగాపోయి ఒపేరా గ్లాసుతో నాలుకచూచి అన్నాడు-- 'కొద్దిగా దిగుబాటుంది. రేపు మళ్లీరా'

మార్వాడీ వెళ్ళిన తర్వాత డాక్టరు తఫాదారు, నందదులాలువంకచూచి అన్నాడు-'వెల్'

"అయ్యా చాలా ఆపదలోవున్నా, కాబట్టే తమవద్దకు వచ్చాను. నిన్న అకస్మాత్తుగా ట్రామునుంచి ..."నందబాబు చెపుతూ వున్నాడు.

తఫాదార్-'కాంపౌండ్ ఫ్రాక్చర్? ఎముక విరిగిందా?'

నందబాబు మొదటినుంచి చివరివరకు తన పరిస్థితి తెలియచేశాడు. నొప్పిలేదు. జ్వరం రావడం లేదు. కడుపునొప్పి, దగ్గు, పడిశం, రొప్పు ఏమీలేవు. నిన్నటినుంచి కొంచెం అకలి తగ్గింది. రాత్రి పీడకలలు వస్తూవుంటవి. మనసులో బిక్కుబిక్కుగా వుంటుంది.

డాక్టరు, నందబాబు ఛాతీ, పొట్ట, తల, చేయి, కాలు చూచి అన్నాడు-'నాలుకచూపు.'

నందబాబు నాలుక చాపాడు.



'—ఇక వాలుక ముడుచుకోవచ్చు'

డాక్టరు ముఖము కొంచెము చిట్లించుకుని కలం తీశాడు. ప్రిస్క్రిప్షన్ వ్రాసినతరువాత నందబాబు వంకచూచి అన్నాడు--ఇక నాలుక ముడుచుకోవచ్చు. ఈమందు రోజూ మూడుసార్లు త్రాగండి.

నంద--నా కండీషన్ ఎట్లావుంది మీ ఉద్దేశ్యంలో?

తఫా—-వెరీ బ్యాడ్.

నందబాబు భయపడుతూ భయపడుతూ అడిగాడు--జబ్బేమిటి?

తఫా—ఇంకా కొన్నిరోజులు వాచ్‌చేయంది సరిగా చెప్పలేను. కాని cerebrel tumour with strangulated ganglia అని అనుమానంగా వుంది. ట్రిపాయిన్‌చేసి (తలకు బెజ్జంపెట్టి) ఆపరేషను చెయ్యాల్సుంటుంది. మెడకోసి నరాలమెలిక వదిలించాలి. పార్టుసర్కి[illegible]ది.

నంద—ప్రాణభయ మేమీ లేదుగా?

తఫా—భయపడ కోకండి, భయపడితే నేను నయంచేయలేను. వారంరోజుల తర్వాత మళ్లీరండి. మై ఫ్రండ్ మేజర్ గోసాయితో కన్సల్టుచేసి నిర్ధారణ చేస్తా. పప్పూ, అన్నం తినవద్దు. ఎగ్‌ఫ్లిప్, బోన్ మేరో సూప్, చికెన్‌స్టూ, వగైరాలు పుచ్చుకోండి. సాయంత్రం కొంచెం బ్రాండీ పుచ్చుకోవచ్చు. ఐస్ వాటర్ బాగా త్రాగండి—ఆఁ ముప్పైరెండు రూపాయలు...థ్యాంక్యూ.

నందదులాల్ బాబు కాళ్లీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

సాయంత్రం బంకూ వచ్చి అన్నాడు—అరే, నేనప్పుడే చెప్పలా వాడిదగ్గరకు పోవద్దని? ముండాకొడుకు మారువాడీల బుర్రలు నవరించి సంపాదిస్తున్నాడు. హూఁ! తలమీద ఆపరేషను చేస్తాడు!

షష్ఠీ బాబు—మన పేటలోవున్న తారిణీ కవిరాజుకు (ఆయుర్వేద వైద్యుడు) ఎందుకు చూపవు?

గోపీ బాబు—వద్దొద్దు. అసలు నందబాబు తల్లో ఏమైనా తిరుగుడు జరిగుంటే ఆగొడ్డువైద్యుడి వల్ల ఏమీ కాదు. హోమియోపథియే మంచిది.

నిధిరామ్—నా క్షోభ ఆలకించేవాడే లేడు. డాక్టరీ నచ్చకపోతే నాటువైద్యమే కానీయండి. నౌకరిప్పుడే తయారుచేశాడు. తీసుకు రమ్మంటారా కొద్దిగా భంగు?

ఆఖరుకు హోమియోపథి వైద్యము చేయించటం నిశ్చయమైంది.

* * *

రెండవరోజు ఉదయాన్నే నందబాబు నేపాలు డాక్టరు ఇంటికి వెళ్లాడు. రోగులింకా అంత రావటం సాగలేదు. కొంచెం సేపటికే నందబాబు వంతు వచ్చింది. పెద్ద గదిలో నేలమీద తివాచీ పరచి వుంది. పుస్తకాలు కుప్పలు కుప్పలుగా పడి వున్నై. పుస్తకాలగోడలమధ్య పంచతంత్రంలోని నక్క వలె వృద్ధ నేపాలబాబు కూర్చొని వున్నాడు. నోట్లో హుక్కా. పొగ యింటినిండా కమ్మివుంది.

నందబాబు నమస్కారంచేసి నిలబడ్డాడు. నేపాల బాబు తీక్షణంగా చూస్తూ అన్నాడు—కూర్చోటానికి చోటుందే!

నంద బాబు కూర్చున్నాడు.

నేపాల్—శ్వాస ఆడుతుందా?

నంద—అయ్యా?

నేపావ్—నేనడిగే దెందుకంటే, సామాన్యంగా రోగిని బయటపెట్టినతర్వాతనే నన్ను పిలుస్తూ వుంటారు.

—"నేనే రోగిని" నందబాబు వినయంగా అన్నాడు.

నేపాల్—దోపిడిగాళ్ళ చేతుల్లోంచి చాలా తొందరగా తప్పించుకొచ్చావే?—సరే, నీకేమయిందో చెప్పు?

నంద బాబు తన కథఅంతా చెప్పాడు.

నేపా—తఫాదార్ ఏమన్నాడు?

నంద—నా తలలో ట్యూమరు వుందన్నాడు.

నేపా—తఫాదార్ తల్లో ఏముందో నీకు తెల్సా? గోబర్ (పేడ) టోపీలోపల కొమ్ములు. బూట్లకు లోపల గిట్టలు. పంట్లాంలోపల తోక.—ఆకలవుతుందా?

నంద—రెండు రోజులనుంచి బొత్తిగా కావడం లేదు.

నేపాల్—నిద్రొస్తుందా?

నంద—లేదు.

నేపా—తలనొప్పి వుందా?

నంద—నిన్న సాయంత్రం వుంది.

నేపా—ఎడమవైపా?

నంద—చిత్తం.

నేపాల్‌బాబు గర్జించి అడిగాడు—తిన్నగా జవాబు చెప్పు.

నంద-చిత్తం, సరిగ్గా-మధ్యని.

నేపా—కడుపులో మెలేస్తుంటుందా?

నంద—ఆఁ. ఆరోజున వుంది. నిధియా కాబూలీ బఠానీలు తెచ్చాడు. అవి తింటంవల్ల—

నేపా—కడుపులో మలేస్తుంటుందా నొప్పిగా వుంటుందా, సరిగ్గా చెప్పు




‘గుడుగుడుగుడుగుడు’ అంటుంది

నందబాబు గాభరా పడ్డాడు—‘గుడుగుడు, గుడుగుడు, అంటుంది.’ అన్నాడు.

డాక్టరు మొదట పెద్దపెద్ద పుస్తకాలు తీసి చూశాడు. తర్వాత కొంచెం సేపు ఆలోచించి అన్నాడు.—ఆహాఁ. ఒక మందు యిస్తున్నా తీసుకుపో; ముందు నీశరీరంలోవున్న అలోపథిక్ విషాన్ని పారదోలాలి. నా అయిదోయేట వెధవలు నావంట్లో రెండు గ్రైన్ల క్వినైన్ ఎక్కించారు. ఈ రోజువరకు సాయంత్రం తల చిటపటమంటూ వుంటుంది. వారం రోజులైనాక మళ్లీ రా. అప్పుడు అసలు వైద్యం సాగుతుంది.

నంద-నాజబ్బేమిటో...?

డాక్టరు కనుబొమలు చిట్లించుకొని అన్నాడు-- జబ్బు తెల్సుకుంటే నీకేమి వూడి పడుతుందని నీపొట్టలో Differential calculus అయ్యిందంటే నీకేమి తెలుస్తుంది? అన్నంతినొద్దు. రెండు పూటలు రొట్టె తిను. చిట్టుడుకునీళ్ళు త్రాగు స్నానంబొత్తిగా పనికిరాదు. వేడినీళ్ళు కొద్దికొద్దిగా త్రాగవచ్చు. చుట్ట కాల్చొద్దు, పొగ తగిలితే మందు పటుత్వం తగ్గుతుంది...... ఏమిటి ఆలోచిస్తావ్? మా బీరువాలోని మందులన్నీ చెడి పోయాయనా? లేదు, లేదు, మా పుగాకులో సల్ఫర్ థర్టీ కలిసి వుంటుంది. ఫీజెంతోకూడ చెప్పాల్సిందేనా? చూడటంలా, గోడమీద నోటీసు వ్రేలాడుతోంది- ముప్పై రెండు రూపాయలు మందుఖర్చు నాలుగు.

నందబాబు పైకంయిచ్చి వెళ్లి పోయాడు.

* * *

నిధిరాం అన్నాడు-- ఎందుకు మిస్టర్! వృథాగా డబ్బు తగలేసుకుంటం? ఇంతకంటే ఐదుసార్లు బాక్సులోకూర్చుని థియేటరు చూస్తే బాగుండేది. అరే ఆ నేపాలా! జిత్తులమారి ముండాకొడుకు, పాపం మన నందూ

భాయీని అమాయికుణ్ణిచేసి టోపీ వేశాడు. నాచేతులో పడితే తెలిసేది. వాడెంత హెూమియోపత్తో? ఒక్క గుక్కలో వాడి బీరువాతో సహా అన్ని మందులు త్రాగివేయ లేకపోతే నాపేరు నిధిరాం కాదనుకో!

గోపీ——ఫర్రుఖాబాదునుంచి గొప్ప హకీం వచ్చాడని, యివ్వాళ ఆఫీసులో అనుకుంటున్నారు. చాలా పేరుచెందిన హకీం, రాజాలుమహారాజాలు ఇతని చేతనే చికిత్సచేయించుకొంటూవుంటారు. ఒక పర్యాయం అతనికి చూపిస్తే బాగుంటుంది.

షష్ఠీ--ఇటువంటి చలికాలంలో హకీం వైద్యమా? అమ్మయ్యో, షర్బత్తు త్రాగించి త్రాగించి నిలువునా ప్రాణం తీస్తాడు. అంతకన్న మన తారిణీకవిరాజే మంచివాడు.

ఆఖరికి కవిరాజు (వైద్యుడు) దగ్గరకు వెళ్ళడమే నిశ్చయమైంది.

* * *

రెండోరోజు ఉదయం నందబాబు తారిణీ కవిరాజు యింటికి హాజరయాడు. కవిరాజుగారి ప్రాయం దాదాపు అరవై వత్సరాలుండచ్చు. దుర్బలంగా వుంటాడు. గడ్డాలు, మీసాలు గొరిగించాడు. దేహమంతా నూనె పట్టించి యెనిమిది మూళ్ళ ధోవతి కట్టుకొని కుర్చీమీద గొంతుకూర్చొనివున్నాడు. చేతిలో హుక్కావుంది. తదేకధ్యానంతో పీలుస్తూ వున్నాడు. ఇదేస్థితిలో ఆయన రోజూ రోగుల్ని చూస్తూ వుంటాడు. గదిలో ఒక తఖ్తు బల్ల వుంది. దానిమీద ఒక నూనెఅయిన చాప, మురికిగావున్న దిళ్ళు పడివున్నై. గోడకు ఆనించి రెండు మందుల బీరువాలున్నై. నందబాబు నమస్కారంచేసి బల్లమీద చతికిలబడ్డాడు. కవిరాజు అడిగాడు-- ఏమండీ బాబుగారూ! ఎక్కడినుండి దయచేశారు?

నందబాబు తనపేరు, చిరునామా తెలియజేశాడు.

తారిణీ--రోగికి జబ్బేంటి?

నందబాబు తానే రోగిననిచెప్పి తన స్థితినంతా వినిపించాడు.

తారిణీ--తలకు బెజ్జం పెట్టాడాఏం?

నంద--లేదండీ, నేపాల్ బాబు మూత్ర సంబంధమైన జబ్బన్నాడు. అందుకనే నే నాపరేషన్ చేయించలా.

తారిణీ--నేపాల్? ఎవడువాడు, ఏం చేస్తుంటాడూ?

నంద--తమ రెరుగరూ వార్ని? బోరాబాగ్‌లో వుండే నేపాల్ చంద్ర రాయ్. M. B. F. T. S. గొప్ప హెూమియోపథిక్ డాక్టరు.

తారిణీ--అరే, ఆ నేపాల్‌గాడి సంగతా చెప్పేది! అయితే స్పష్టంగా ఎందుకు చెప్పవు? వాడు డాక్టరు ఎప్పటినుంచి అయ్యాడు? అరే మీ పేటలో ఇటువంటి కవిరాజు వుండగా నీవా కుర్రకుంకల దగ్గర కెందు కెళ్ళావు?

నంద--మిత్రులు డాక్టరుకు చూపించి ఆయన సలహా తీసుకోమన్నారు. ఒకవేళ ఆపరేషన్ చేయవలసుంటుందేమోనని.

తారిణీ-- జయంతిబాబును ఎరుగుదువూ? ఖుల్నాలోవుండే వకీలు జయంతి బాబు?

నందబాబు తల వూపాడు

తారిణీ-- ఆయన మామకు ఊరుస్తంభం అయింది. సివిలుసర్జన్ కాలు తీసివేశాడు. మూడు రోజులవరకు ఒళ్లు తెలియకుండా పడివున్నాడు. కొంచెం తెలివిరాగానే అడిగాడు- 'నా కాలేమైంది?- పిలువు తారిణీసేన్ని?'-ఇచ్చింది ఒకతులం చ్యవనప్రాశ ఏం జరిగిందో చెప్పు?

నంద-తిరిగి కాలొచ్చిందా ఏం?

-"అరే రాముడూ! వెధవాయి, చూడు పిల్లి ఆవునెయ్యంతా త్రాగిపోతోంది" అంటూ కవిరాజ ప్రక్కగదిలోకి పరుగెత్తాడు. కొంచెం శేపటికి

తిరిగివచ్చి పూర్వం మాదిరిగానే కుర్చీలోకూర్చుని అన్నాడు-ఏదీ, నాడి కొంచెంచూద్దాం-నే ననుకున్న దే నిజమయింది. ఎప్పుడైనా పెద్దజబ్బు పడ్డావా?


నంద-చాలకాలం క్రిందట టైఫాయిడ్ వచ్చింది ఒకసారి.

తారిణీ-సరిగ్గాపట్టా అయిదేండ్లక్రిందట కాదూ?

నంద-దాదాపు ఏడేండ్లయింది.

తారిణీ-రెండూ ఒకటే. అయిదూ రెండు ఏడు-ఉదయం డోకు వస్తోందికదూ?

నంద-లేదండీ.



—వస్తోంది, నీకు తెలియకపోవచ్చు.

తారిణీ-వస్తోంది, నీకు తెలియక పోవచ్చు-నిద్ర పట్టుతుందా?

నంద-బాగా పట్టడంలేదు.

తారిణీ-ఎట్లా వస్తుంది? ఊర్ధ్వం అయింది కాదూ?-వళ్లుతీపులుగా వుంటయ్యా?

నంద-లేదు.

తారిణీ-ఉంటై నీకు బాధకాక పోవచ్చు. సరే, ఏమీాదిగులు పడక్కరలా. అంతా నయమైపోతుంది. నేనొక మందిస్తా.

కవిరాజ బీరువాలోంచి ఒకసీసా తీసి కదిలిస్తూ అందులోవున్న మాత్రలతో చెప్పసాగాడు-అరే, ఎగరొద్దు! ఆగండి, ఆగండి! మామందులన్నీ జీవౌషధాలు. పిలిస్తే పలుకుతై. మూడురోజులకు మందిచ్చాను. ఉదయం, సాయంత్రం ఒక్కొక్కమాత్ర వేసుకో. మూడు రోజులున్నాక మళ్లీరా, తెల్సిందా?

నంద-ఆఁ.

తారిణీ-నామొఖం తెల్సింది. ఇంకా అనుపానం చెప్పాల్సే వుందిగా? నిమ్మకాయ రసం, తేనె రెంటిలోకలుపుకుని తాగు. వరి అన్నం తినకూడదు. కందదుంపలు, చేమదుంపలు వుడకవేసుకుతిను. ఉప్పు తగులకూడదు. చేపలపులుసులో కొంచెం చక్కెర కలుపుకు తినొచ్చు. వేడినీళ్లు చల్లార్చుకుని త్రాగు.

నంద-జబ్బేమిటి?

తారిణీ-జబ్బా?— 'ఉదరీ' అంటారు. 'ఊర్ధ్వశ్లేష్మం' అనికూడ అనొచ్చు.

నందబాబు కవిరాజుకు ఫీజు, మందు ఖర్చులు యిచ్చుకొని విచారంతో వెళ్లిపోయాడు.

* * *

నిధిరాం అన్నాడు-ఏం భాయీ! ఆయుర్వేదం మీాది భ్రమ తీరిందాలేదా?

గోపీ-ఈ కూరగాయ వైద్యాలవల్ల ఏమీా లాభంలేదు. పోదాం పదండి, ఎక్కడికైనా ఛేంజికి.

బంకూ-నేను చెప్పడంలా పెళ్లి చేసుకుని భార్యను తీసుకువస్తే యీాపేచీలన్నీ వుండవని? ఒంటరిగా వుంటమే యీా రోగాలకుమూలం.

నందబాబు విసుక్కుంటూ అన్నాడు-ఊఁ, పెళ్లి! యివ్వాళ వున్నాను, రేపటిసంగతి తెలియదు.

ఈ యీడున ఒకచిన్న పిల్లని పెళ్లిచేసుకుని ఇంకా ఊబిలో దిగమంటారు.

నిధిరాం-బ్రదర్! ఒక మోటరుకారుకొను నిజంగా; రెండురోజులు గాలిమేయి. బాగుపడుతావో లేదో చూద్దాం. సెవెన్‌సీటర్‌హడ్సన్! భగవంతుని కృపవల్ల మేంకూడ అయిదుగురం మున్నాం.

షష్టీ-సరే, చెప్పావా యింకేమన్నా దిగు బడిందా?-నాఉద్దేశం మోటరుకారు కొంటం, పెళ్లిచేసు కుంటం ఒకటే. ఇంట్లోకి తీసుకురావడం సులభమే, మరమ్మతు ఖర్చులు పెట్టేటప్పటికి తాతలు దిగొస్తారు. ఇవ్వాళ టైరు పగిలితే రేపు భార్యకు శూలనొప్పి వస్తుంది. ఎల్లుండిబ్యాటరీ చెడితే ఆవలెల్లుండి పిల్లాడు జలుబుచేసి జ్వరపడతాడు. అరే, ఎక్కడన్నా పొర పాటుపడేవు నందలాల్! మునిగిపోతావు. ఈ చలి కాలంలో ముసుకేసుకుని తన్నిపెట్టి పండుకుంటానికి బదులు రాత్రంతా కుయ్యి, మొర్రో...!

నిధిరాం-కక్క-య్య మాదిరిలెఖగాడు. బాగా వెంట్రుకలున్న మెలుగు బంటివంటి పిల్లని పెళ్ళిచేసుకో వల్సింది. కనీసం కంబళ్లు ఖర్చులన్నా తగ్గేవి.

గోపీ—వందయ్యేదగ్గర ఇంకోపాతిక. రేపు వుద యం హకీంసాహేబు దగ్గరకు కూడ వెళ్ళిరా. తర్వాత చూద్దాం.

బాబు దీని కిష్టపడ్డాడు.

*  *  *

హాజిల్ ఉల్‌ముల్క్ బినలుకమాన్, నూరుల్లా, గజన్ ఫరుల్లా, ఆల్ హకీం యూనానీ, లోయర్ చిత్‌పూర్‌పూరు రోడ్డులో బసచేసి వున్నాడు. నంద బాబు మూడో అంతస్థుకు చేరేసరికి లుంగీ, చొక్కా పెడటోపీ తగిలించుకొని గళ్ళరుమాలు పైనవేసుకున్న ఒక మనిషి ఎదురుగావచ్చి అన్నాడు—రండి బాబు గారూ! నేను హకీం సాహేబుగారి మీర్‌మున్షీ (హెడ్ గుమాస్తా)ని. మీ జబ్బేమిటో వ్రాసివ్వండి. నేను హుజూరుకు తెలియపరుస్తాను.

నంద—జబ్బేమిటో తెల్సుకోటానికేగా నే వొచ్చింది.

మున్షీ—అయినా ఏదో చెప్పండి. బలహీనమా, జ్వరమా, మశూచకమా, మల్లలా, రేచీకటా—?

నంద—అవేమీ కాదు,—మనస్సులో కలతగా వుంది.

మున్షీ—ఇంకేం, ఎద్దైనా చెప్పితేనేగా తెలి సేది? మనస్సు పరితపించటం? మొహరీలు తెచ్చావా?

నంద—మొహరీలా?

మున్షీ—హకీంసాహెబుగారు వెండి అంటు కోరు. నజరానా రెండు మొహరీలు. లేకపోతే నే నిస్తాను. నలభై అయిదురూపాయలు. రెండు రూపా యలు వొట్టం. పట్టురుమాలు రెండు రూపాయలు. దర్బారులోకి వెళ్ళి హుజూర్‌గారికి 'బందగీజనాబ్' అనండి. తరువాత రుమాలులో రెండు మొహరీలువుంచి వారికి దాఖలు చేసికోండి.

నందదులాల్‌బాబుకు పాఠం నేర్పి దర్బారు లోకి తీసుకెళ్లాడు మున్షీ. పెద్దగదినిండా జముఖానాలు పరచి వున్నై. ఒక సింహాసనం వంటి దాని మీద బాలీసుకు ఆనుకొని హకీమ్ సాహేబు హుక్కా పీలుస్తున్నాడు. దాదాపు యాభై యేండ్లుంటై. వెంట్రు కలు వుంగరాలు తిరిగి వున్నై. మీసాలు కురచగా పలుచగా కత్తిరించి వున్నై. రొమ్ములవరకు వ్రేలా డుతూ వుండే గడ్డం, మొదటిభాగం తెలుపు, మధ్య భాగం ఎరుపు, చివర భాగం వంగుపండురంగు. దుస్తులు పట్టు జామా, సిల్కుచొక్కా, చమకీ చేసిన ముఖమల్ టోపీ. ఎదుట 'ధూపదాన్'లో అగరు, అంబరు కాలుతూ వుంది. ప్రక్కన 'పీక్‌దాన్,' 'పాన దాన్', 'యిత్రదాన్' వున్నై. అయిదారు గురు స్నేహితులు ప్రక్కన కూర్చొని హకీంసాహేబు ప్రతిమాటకు 'అహా!' 'ఏం చెప్పారు.' 'అద్భుతం' 'ఆశ్చర్యం!' అంటూ వున్నారు. ఆ గదిలో ఒక

మూలను కూర్చున్న ముసలి సాహేబు సితారు వాయిస్తూ అసహ్యమైన అంగభంగిమలు చూపిస్తున్నాడు.

నందబాబు చాల వినయంగా సలాం చేసి రుమాలుతో సహా మొహరీలు సమర్పించుకున్నాడు. హాకీం సాహెబు చిరునవ్వు నవ్వి యిత్రదాన్ 'లోంచి కొంచెం దూదితీసి చెవిలో పెట్టాడు.

మున్షీ అన్నాడు- మీ జబ్బేమిటో బంగాలీలోనే చెప్పండి. నేను హుజూరుకు తెలియజేస్తాను.

నందబాబు విషయమంతా తెలియ చెప్పగానే హాకీం సాహేబు ఋషభస్వరంలో అన్నాడు- తల యిలాయివ్వు.

నందబాబు గుండె దడదడ లాడింది.

"ఎందుకండీ భయపడుతారు! హుజూరుకు మీ తల కొంచెం చూపండి-" మున్షీ భయం పోగొట్ట ప్రయత్నించాడు.

నందబాబు తల అటుయిటూవత్తి హాకీం అన్నాడు- ఎముక జవ జవ లాడుతోంది.

"తెలిసిందండీ, పుర్రె బొత్తిగా మెత్తబడిపోయిందట" మున్షీ అర్థం చెప్పాడు.

హాకీం మూడు రంగుల గడ్డం సవరించుకుంటూ అన్నాడు-- "సుర్మాసుర్ఖ్."

ఒకడు ఎర్ర ఎర్రని చూర్ణం తెచ్చి నందబాబు కను రెప్పలకు రాశాడు.

"ఇది పెట్టుకుంటే కళ్ళు చల్లబడతై నిద్ర బాగా పడుతుంది." మున్షీ మందుగుణం వెల్లడించాడు.

హాకిం అన్నాడు--"రోగన్ బబ్బర్."

"ఏయ్ మంగలీ, కత్తి తీసుకురా" మున్షీ కేక వేశాడు.

నందబాబు అయ్‌అయ్, అరెరే, ఏమిటి చేసేదీ!" అంటూనే వున్నాడు. మంగలి మాడుమీద రెండంగుళాల చదరంగా గొరిగివేశాడు. ఇంకోమనిషి ఇెడువాసనకొట్టే తైలంతెచ్చి దానిమీద రాశాడు-"భయపడకండి బాబుగారూ! ఇది పులితలలోనుంచి తీసిన చమురు. చాల విలువగలది. పుర్రె గట్టిపడుతుంది!" మున్షీ ఓదార్చాడు.

నందబాబు కొంచెం సేపటివరకు స్పృహలేని వాడిమాదిరిగా కూర్చున్నాడు. తరువాత తెలివి తెచ్చుకుని అక్కడినుంచి పరుగెత్తాడు. మున్షీ కూడ వెంటబడి అడిగాడు--నా బక్షీస్?

నందబాబు ఒక రూపాయ విసరేసి తత్తర బిత్తరగా క్రిందకు దిగి, ఎగిరి బండెక్కి బండి వాడితో అన్నాడు--పోనీ!

సాయంత్రం మిత్రులువచ్చేసరికి తలుపులు బిగించివున్నై. నౌకరు చెప్పాడు-- "యివ్వాళ బాబుగారి శరీరం చాల సుస్తీగావుంది. చూడ్డానికి వీల్లేదు.' మిత్రులంతా విచారంతో వెళ్లిపోయారు.

* * *

నందబాబు రాత్రంతా ప్రక్కమీద అటుయిటు తన్నుకుంటూ గడపాడు. తెల్లవారుఝామున నాలుగు ఘంటలకు లేచి యిక మిత్రుల సలహా వినగూడదని ప్రతిజ్ఞ చేసుకున్నాడు. తన వైద్యం తన యిష్ట ప్రకారమే చేయించుకుంటాడు.

ఉదయం ఎనిమిది ఘంటలకు నందబాబు యింటినుండి బయలుదేరాడు. టాక్సీవానితో తిన్నగా పోనివ్వమని చెప్పాడు. మీటర్ ఒకరూపాయి చూపగానే టాక్సీవదలేసి ఆ సమీపంలోవున్న డాక్టరుచేతగాని, వైద్యునిచేతగాని చికిత్స చేయించుకోవాలని నిశ్చయించుకున్నాడు-వాడు ఎలోపతీగానీ, హోమియోపథిగానీ, కవిరాజుగానీ, వైద్యరాజుగానీ, భూతవైద్యుడుగానీ, దంతవైద్యుడుగానీ-ఎవడైనాగానీ.

బవుబజారువరకువెళ్ళి టాక్సీవదలాడు. ప్రక్కగల్లీకి తిరగంగానే సైన్‌బోర్డు కనపడింది.-'మిస్. వి. మల్లిక్' నందబాబు మిస్ శబ్దాన్ని చూడలేదు. చూస్తే

కొంచెం సందేహించేవాడే. వాకిట్లో ప్రేలాడే పరదాను తొలగించుకొని లోపల ప్రవేశించాడు.

మిస్ విపులామల్లిక్ బయటకు వెళ్ళటానికై భుజంమీదవున్న సేఫ్టీపిన్ను సర్దుకుంటూవుంది. నందబాబునుచూచి మధురస్వరంలో అడిగింది—"తమ రెందుకొచ్చారు?"

నందబాబు మొదట కొంచెం సందేహించాడు. తిరిగి భాగ్యంమీద భారంవేసి అనుకున్నాడు-ఊఁ ఏమన్నాకానీ లేడీడాక్టరు సలహాయే తీసుకుందాం. పైకి అన్నాడు-"చాలా కష్టాలుపడి మీవద్దకువచ్చా".

మిస్ మల్లిక్-"నొప్పులు ఆరంభమైనాయా?

నంద-నొప్పేమి కనపడటంలేదు.

మిస్-ఫస్ట్ కన్‌ఫయిన్మెంటా?

నంద-ఏమండీ?

మిస్ తొలికాన్పా?

నందదులాల్ బాబు సిగ్గుపడి అన్నాడు-నేను నా చికిత్సకోసమే వచ్చాను.

మిస్ మల్లిక్ ఆశ్చర్యంతో అడిగింది-మీ కోసమా? జబ్బేమిటి?

కథఅంతా విన్నతరువాత మిస్ మల్లిక్ నందబాబు ఆరోగ్యాన్నిగురించి నాలుగైదు ప్రశ్నలువేసి, అంది- "తమపేరు తెల్సుకో వచ్చా?"

నంద-శ్రీనందదులాల్ మిత్ర.

మిస్-ఇంట్లో ఎవరెవరున్నారు?

నంద-భార్య ఇదివరకే చనిపోయింది. ఇంట్లోమేనత్త తప్పితే ఎవరూలేరు.

మిస్-మీరేమి పనిచేస్తూవుంటారు?

నంద-పనీగినీ ఏమీలేదు. జమీందారీ వుంది.

మిస్-మోటురు కారుందా?

నంద-లేదుకాని కొనాలనుకుంటున్నా.

మిస్ మల్లిక్ యింకా అనేకరకములైన ప్రశ్నలువేసి పెదవిమీద ప్రేలు పెట్టుకొని కొంచెంసేపు ఆలోచించింది. తర్వాత నెమ్మదిగా తల అటుయిటూ వూపింది.

నందబాబు వ్యాకులపడి అడిగాడు-"సలాం, డాక్టరుగారూ, నిజంగా చెప్పండి నాజబ్బేమిటో? ట్యూమరా, మూత్రవ్యాధా, ఉదరీయా, కాలజ్వరమా, హైడ్రోఫోబియా?"

మిస్ మల్లిక్ నవ్వుతూ జవాబు చెప్పింది—ఎందుకంత గాభరా పడుతారు? వీటిలో మీ కే మీ రోగము లేదు. మిమ్మల్ని కనిపెట్టి చూట్టానికి ఒక మనిషి కావాలి.

నందబాబు దీనంగా అడిగాడు—అయితే నేను పిచ్చివాడినైయ్యానా?

మిస్ మల్లిక్ నోటికిరుమాలు అడ్డంగా పెట్టుకుని నవ్వసాగింది. —"ఓ డియర్, డియర్! నో. పిచ్చివారెందుకవుతారు? తమ సుఖంచేకూర్చటానికి ఒక మనిషి కావాలనని నేనంటున్నా." అంది

నంద—ఏం, మేనత్త వుందిగా?



"—ది అయిడియా"

మిస్ విపులా తిరిగి నవ్వింది—ది అయిడియా! మేనత్తల గీనత్తలవల్ల లాభంలేదు. సరే, ముందు ఒక మందు యిస్తున్నాను. తిని చూడండి. చాల తియ్యగా వుంటుంది. యాలక్కాయిల వాసనకొడ్తూ వారం రోజులైన తరువాత మళ్లీ రండీ'

*　　*　　*



విపులానంద్!

నందబాబు వారం రోజులయ్యాక మళ్లా విపులామల్లిక్ యింటికి వెళ్లాడు. రెండు రోజులైన తరువాత తిరిగి వెళ్లాడు. తర్వాత ప్రతి దినం.

కొన్నాళ్లయిన తర్వాత మేనత్తను కాశీకి పంపించాడు. బజారుకు వెళ్లి నెయ్యి, పిండి, పంచదార, పెరుగు, చేపలు, మాసం, రసగుల్లా, లడ్లు వగైరా చాల వస్తువులు కొన్నాడు మిత్రులందరకు తినబెట్టాడు.

నంద బాబు సేలం అంచుధోవతి కట్టి సిల్కులాల్చీ వేసుకున్నాడు. సిగ్గుపడుతూ అందరిని సంతోషపెట్టాడు.

మిసెస్ విపులా మిత్ర యిప్పుడు పతికి తప్పితే ఏ రోగికి చికిత్సచేయుటం లేదు. ఆం నందబాబుయిప్పుడు పూర్తిగా ఆరోగ్యవంతుడయ్యాడు. మోటారుకారు కొన్నారు. ఇప్పుడికలోటేమిటంటే సాయంత్రంకూడే మిత్రులు యిప్పుడు కూడకపోవటమే.

—హక్కులు అనువాదకునివి.

*